# పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్

- కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్
- మరోసారి ఆశీర్వదించండి మరింత అభివృద్ధి చేస్తా
- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- కొత్తపల్లిలో బీఆర్ఎస్ బూత్ స్థాయి కమిటీ బాధ్యుల సమావేశం

తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్ 17: బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, బూత్ స్థాయి కమిటీ మెంబర్లు నియోజకవర్గంలోని ప్రతి ఓటరును కలుసుకొని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలని తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ బూత్ స్థాయి కమిటీ బాధ్యుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ, 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో కరెంటు కష్టాలు, ప్రజల బాధలు ఎలా ఉండేవో నేటి యువతరానికి వివరించాలన్నారు. తెలంగాణ రాకముందు పరిస్థితులు.. వచ్చిన తర్వాత స్వరాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని వివరించాలని సూచించారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నిత్యం నియోజకవర్గంలో తిరుగుతూ, లబ్ధిదారులకు పథకాలు అందిస్తున్నారని, నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కారు గుర్తుకే మరోసారి ఓటు వేసి రసమయిని భారీ మెజార్టీతో గెలిపించుకొని నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలే తన బలం బలగమన్నారు. పచ్చని తెలంగాణలో చిచ్చుపెట్టి మన సంపద దోచుకెళ్లాలని కాంగ్రెస్, బీజేపీ చూస్తున్నాయని, ఆ పార్టీల పట్ల జాగ్రత్తగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. పదేళ్ల కేసీఆర్ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. మరోసారి ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఈనుకొండ జితేందర్ రెడ్డి, ల్యాగల వీరారెడ్డి, స్వామిరెడ్డి, తెల్ల రవీందర్, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు, బూత్ సాయి కమిటీ మెంబర్లు



రామడుగు: వెంకట్రావుపల్లిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ వెంట కదులుతున్న జనం

# అభివృద్ధి చేసిన.. మరోసారి ఆశీర్వదించండి



రాంచంద్రాపూర్‌లో ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్

- బీఆర్ఎస్ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్
- రామడుగు మండలంలో ఐదు గ్రామాల్లో ప్రచారం

రామడుగు, అక్టోబర్ 17: నియోజకవర్గంలో అందరికీ ఐదేండ్లుగా అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేశానని, ఎన్నికల్లో ఆశీర్వదించి ఓటేసి మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రామడుగు మండలంలోని రాంచంద్రాపూర్, చిప్పకుర్తి, గుండి, లక్ష్మీపూర్, వెంకట్రావుపల్లితో పాటు అనుబంధ గ్రామం కిష్టంపల్లిలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ మాట్లాడారు. ఐదేండ్ల కాలంలో రాంచంద్రాపూర్, చిప్పకుర్తి, గుండి, లక్ష్మీపూర్, వెంకట్రావుపల్లిలో సుమారు ₹15 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేశానని గుర్తు చేశారు. గతంలో ఎమ్మెల్యేగా గెలిచిన స్థానికేతరులు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఎన్నికల ముందు వచ్చి, తర్వాత వెళ్లిపోయే నాయకులకు ఈ ప్రాంతం మీద మమకారం ఉండదన్నారు. ఈ ప్రాంత బిడ్డనైన తనకే నియోజకవర్గ అభివృద్ధిపై ఆలోచన ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నామని చెప్పారు. అరవై ఏండ్లు పాలించిన కాంగ్రెస్ తెలంగాణకు ఏమీ చేయలేదన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అన్ని వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేలా ఉందని హర్షం వ్యక్తం చేశారు. స్థానిక బిడ్డనైన తనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని సుంకె రవిశంకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామగ్రామాన ప్రతి ఒక్కరినీ పేరుపేరున పిలుస్తూ కారు గుర్తుకే ఓటెయ్యాలని కోరారు. ప్రచారంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు, ఎంపీపీ కలిగేటి కవితాలక్ష్మణ్, జడ్పీటీసీ మార్కొండ లక్ష్మీకిష్టారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్ రెడ్డి, సర్పంచులు చాడ ప్రసన్నాశేఖర్‌రెడ్డి, జుట్టు రాజేశ్వరీలచ్చయ్య, గుండి మానసాప్రవీణ్, చిలుముల రజితాప్రభాకర్, జవ్వాజి శేఖర్, ఎంపీటీసీలు మడ్డి శ్యాంసుందర్‌గౌడ్, కనుకం జయాకనకయ్య, ఆర్బీఎస్ జిల్లా సభ్యుడు వీర్ల సంజీవరావు, మండల కో-ఆర్డినేటర్ జూపాక కరుణాకర్, గోపాల్‌రావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, వైస్ చైర్మన్ చాడ ప్రభాకర్‌రెడ్డి, కొండగట్టు దేవస్థానం డైరెక్టర్ దాసరి రాజేందర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు, ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కార్యకర్త ఒక కథానాయకుడు కావాలి



1వ వార్డులో మాట్లాడుతున్న మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి

- హుజూరాబాద్‌లో గులాబీ జెండా ఎగరాలి
- ఇక్కడి విజయాన్ని కేసీఆర్‌కు గిఫ్టుగా అందిద్దాం
- బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి
- జమ్మికుంటలో పర్యటన.. ముఖ్య కార్యకర్తలతో సమావేశం

జమ్మికుంట, అక్టోబర్ 17: 'నాకొక్క అవకాశం ఇయ్యండి. మీ బిడ్డగా ఆశీర్వదించాలి. పనిచేసే ప్రభుత్వానికే పట్టంగట్టాలే. ఉప ఎన్నికల్లో గెలిచిన ఈటల, తట్టెడు మట్టైనా పోసిండా చెప్పాలే. పనిచేయని నాయకుడు, ప్రజలను పట్టించుకోని వ్యక్తి మనకు అవసరమా..? చెప్పండి. రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్త ఒక కథనాయకుడు కావాలి. హుజూరాబాద్‌లో గులాబీద జెండా ఎగరేసేందుకు పనిచేయాలి. ఇక్కడి విజయాన్ని కేసీఆర్‌కు గిఫ్టుగిద్దాం. ప్రతిపక్షాలకు దిమ్మదిరిగే తీర్పునిచ్చేలా చైతన్యం కలిగించాలి' అని బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 1,2,3,4వ వార్డుల్లో పర్యటించారు. ఆయా వార్డు కౌన్సిలర్లు, వార్డు కమిటీ అధ్యక్షులు, సభ్యుల ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకం ఒక అద్భుతమని, ప్రపంచమే కొనియాడుతున్న వైనాన్ని వివరించారు. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు బీజేపీ పాలిత ప్రాంతాల్లో లేవని, ఏ ఒక్క పథకం అమలు చేసినా చర్చకు సిద్ధమని ప్రకటించారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్ నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. ఉప ఎన్నికల్లో గెలిచిన ఆయన ఏం చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. మూడోసారి రాష్ట్ర సీఎంగా కేసీఆరే ఉంటారని, ఇక్కడ కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గత రెండేళ్లుగా ప్రజల మధ్యలో తిరుగుతున్నానని, మీ సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కరిస్తున్నానని పేర్కొన్నారు. కొందరు నాయకులు పనిగట్టుకుని తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, తాను ఎప్పటికీ మీ వాడినేనని తెలిపారు. పార్టీకి సంబంధించిన ఏ వ్యక్తికైనా సమస్య వస్తే ముందుంటానని, కడుపులో పెట్టుకుని కాపాడుకుంటానని స్పష్టం చేశారు. హుజూరాబాద్‌లో గెలిస్తే రూ.వెయ్యి కోట్లు అందిస్తానని సీఎం హామీ ఇచ్చారని, వచ్చే నిధులతో నియోజకవర్గాన్ని గొప్పగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ప్రతి కార్యకర్త బీఆర్ఎస్ పథకాలపై చర్చ పెట్టాలన్నారు. ఓటు అడిగే హక్కు ఒక్క మనకే ఉందని, కలిసికట్టుగా పనిచేస్తే విజయం మనదేనని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, వార్డు కౌన్సిలర్లు బొంగోని వీరన్న, మారెపల్లి భిక్షపతి, మేడిపల్లి రవీందర్, ఎలగందుల స్వరూప-శ్రీహరి, వార్డు అధ్యక్షులు, సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

## నేడు మండలంలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

చొప్పదండి, అక్టోబర్ 17: మండలంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆర్నకొండ, రాగంపేట, అనంతరం పెద్దకుర్మపల్లి, రేవెల్లి, దేశాయ్‌పేట, మంగళపల్లి, చిట్యాలపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని, పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

